పత్తి అమ్మకాల్లో సందేహాలా.. నివృత్తి చేసుకోండి

నేడు జేడీఎం శ్రీనివాస్‌తో



పత్తి కొనుగోళ్లకు భారత పత్తి సంస్థ (సీసీఐ) సిద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు ఈ ఏడాది 5,13,289 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. 4,10,632 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పత్తిలో తేమశాతం ఆధారంగా సీసీఐ ధర నిర్ణయిస్తుంది. ఈ నేపథ్యంలో గిట్టుబాటు ధర రావడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. అకాల వర్షాలతో రంగు మారిన పత్తి అమ్మకం ఎలా?.. సీసీఐ నిబంధనలు ఏమిటి? తదితర సందేహాలు రైతులను వేధిస్తున్నాయి. గురువారం కింది నెంబర్లకు ఫోన్ చేసి వాటిని నివృత్తి చేసుకోవచ్చు. మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు (జేడీఎం) వి.శ్రీనివాస్ సమాధానాలు ఇస్తారు.

– న్యూస్‌టుడే, ఎనుమాముల మార్కెట్

సంప్రదించాల్సిన చరవాణి నెంబరు
73307 33669, 8985131057
సమయం: ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

డిగ్రీ, పీజీ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు అవకాశం

విద్యానగర్, న్యూస్‌టుడే : కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ, పీజీ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు రాత, ప్రయోగ, సెమినార్ తదితర పరీక్షలు 2024-25 విద్యా సంవత్సరం కాలపరిమితికి సంబంధించి క్లియర్ చేయడానికి అవకాశం కల్పించారు. ఈమేరకు రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. వీటికి సంబంధించిన పరీక్షా రుసుం వివరాలు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో చూడవచ్చని పేర్కొన్నారు.

మరమ్మతులకు ఎన్నాళ్లో?



భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జంగేడు నుంచి మల్హర్ మండలం అనుసానపల్లి గ్రామానికి మధ్యలో వట్టివాగు ప్రాంతంలో తారు రోడ్డు ఏడాది క్రితం అధిక వర్షాలకు కోతకు గురైంది. ఇదే రోడ్డు ఈ ఏడాదిలో కురిసిన వర్షాల కారణంగా మరింత కోతకు గురవడంతో వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. ఇదే రహదారిపై నిత్యం భూపాలపల్లి మండలంలోని నేరేడుపల్లి, వజినపల్లి, గొర్లవీడు, గుడాడుపల్లి గ్రామాలతో పాటు మల్హర్ మండలం అనుసానపల్లి, తాడ్వాయి, నాచారం గ్రామాలకు చెందిన వందలాది మంది నిత్యం వాహనాలపై కాళేశ్వరం, జంగేడు, భూపాలపల్లికి వస్తుంటారు. పలుమార్లు రోడ్డు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకోవడం లేదు. – న్యూస్‌టుడే, భూపాలపల్లి

ఉపాధ్యాయ కొలువుల్లో.. మహిళామణులు



మొదటి నుంచి లక్ష్యాన్ని ఎంచుకుని ప్రణాళికాబద్ధంగా చదివి.. అనుకున్న ఉద్యోగాన్ని సాధించడంలో మహిళలు ముందంజలో నిలుస్తున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కొన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో పురుష అభ్యర్థులతో సమానంగా పోటీ పడుతున్నారు. గతంలో పోలీసు ఉద్యోగాల భర్తీలో మహిళా పోస్టులకు విపరీతమైన పోటీ నెలకొనడం విశేషం. ఆ తర్వాత అటవీశాఖ ఉద్యోగాల్లోనూ క్లిష్టమైన పరీక్షలు ఎదుర్కొని ప్రతిభచూపిన వారు ఉన్నారు. అటవీ శాఖలో మహిళలు సుదీర్ఘ నడక సాగించి కొలువు కొట్టారు. సింగరేణి సంస్థలో అండర్ మేనేజర్‌గా ఎంపికైన మహిళామణులు ఉన్నారు. తాజాగా డీఎస్సీలోనూ జిల్లాలో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఎంపికయ్యారు. –న్యూస్‌టుడే, భూపాలపల్లి

డీఎస్సీలో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ), స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ), ప్రత్యేక విద్య, వ్యాయామ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు భర్తీ చేశారు. ఇటీవల ప్రభుత్వ, స్థానిక సంస్థల విద్యాలయాల వారీగా ఉన్నాయి. ప్రభుత్వ ప్రాథమిక విద్యాలయాల్లో ఎక్కువగా మహిళా ఉపాధ్యాయులే హవా కనిపించింది. విద్యార్థులకు మెరుగైన విద్య అందించి.. వారు భవిష్యత్తుల్లో ఉన్నత స్థానాలకు ఎదిగేలా కృషి చేయాల్సిన బాధ్యత మహిళా ఉపాధ్యాయులపైనా ఉంది. నియామక ప్రక్రియ పూర్తయిన డీఎస్సీ-2024లో జిల్లాలో పురుషుల కంటే ఎక్కువ మంది మహిళా అభ్యర్థులే ఉపాధ్యాయ కొలువు చేపట్టారు. వారికి కేటాయించిన ప్రభుత్వ బడుల్లో తొలి రోజు బుధవారం విద్యార్థులకు సంతోషంగా బోధన ప్రారంభించారు.

మొత్తం భర్తీ చేసిన పోస్టులు:	212
మహిళలు:	111
పురుషులు:	101

జిల్లాలో వివరాలు..	
మొత్తం మంజూరైన పోస్టులు:	1829
ప్రస్తుతం పనిచేస్తున్న వారు:	1602
ఖాళీలు:	227

ఎంపికైన వారు వయసుల వారీగా	
20-30 ఏళ్లు:	145
30-40:	52
40-45:	15



మహాముత్తారం మండలం కొర్లకుంట ప్రభుత్వ పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయులు

యువ ఉపాధ్యాయులపైనే భవిష్యత్తు..

జిల్లాలో కొత్తగా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిలో ఎక్కువగా యువతే ఉన్నారు. వీరిని మారుమూల గ్రామాల్లో ఖాళీగా ఉన్న పాఠశాలల్లో, విద్యార్థుల సంఖ్య ఆధారంగా కేటాయించారు. ఈ మేరకు ఎనిమిదేళ్ల తర్వాత ప్రభుత్వం చేపట్టిన డీఎస్సీలో ఎంపికైన యువ ఉపాధ్యాయులు ఉత్సాహంగా విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందించాలి. అంకితభావంతో పని చేస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులకు విద్య అందించడమే లక్ష్యంగా ముందుకెళ్లాలి. గతంలో ఉపాధ్యాయ ఖాళీల కారణంగా అనేక గ్రామాల్లో చదువులు కుంటుపడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలోని అన్ని సర్కారు బడుల్లో ఉపాధ్యాయుల కొరత తీరింది. కానీ, కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి పాఠశాలల్లో ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

సంతృప్తిగా ఉంది..



ఈమె పేరు మధుకవి వెన్నెల.. ప్రస్తుతం భూపాలపల్లిలోనే నివాసం ఉంటున్నారు. రెండు నెలల క్రితమే చిట్యాల సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. అంతకు ముందు ఆరు నెలల క్రితం మల్హర్ మండలంలో కేజీబీవీలో స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం ఎస్జీటీ ఉపాధ్యాయురాలుగా మహాముత్తారం మండలం రేగులగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బాధ్యతలు చేపట్టారు. వెన్నెల మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై తోటి ఉపాధ్యాయులు, కుటుంబసభ్యుల నుంచి అభినందనలు అందుకున్నారు.

అటవీ గ్రామాలకే అధిక ప్రాధాన్యం

- రాజేందర్, డీఈవో

అటవీ గ్రామాల్లోనే ఖాళీగా ఉన్న చోట విద్యార్థుల సంఖ్య ఆధారంగా కొత్త ఉపాధ్యాయులను పోస్టింగ్ ఇచ్చాం. ఎక్కువైతే ఉపాధ్యాయుల కొరత ఉండే గుర్తించి, అక్కడే ఎక్కువ సంఖ్యలో కేటాయించాం. బుధవారం మొదటి రోజు మొత్తం 212 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని సూచించారు.

అసలేం జరుగుతోంది?

● మంత్రి కొండా సురేఖపై సొంత పార్టీ ఎమ్మెల్యేల అసంతృప్తి

రంగంపేట, న్యూస్‌టుడే



ఓరుగల్లు కాంగ్రెస్ రాజకీయం రోజురోజుకు వేడెక్కుతోంది. మంత్రి కొండా సురేఖపై సొంత పార్టీ ఎమ్మెల్యేలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజులుగా కాంగ్రెస్ పెద్దలను కలిసి వరుస ఫిర్యాదులు చేయడం ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. కొన్ని నెలలుగా ఇది అంతర్గతంగా సాగినా ఇటీవల జరిగిన ఘటనలతో బహిర్గతమైంది. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షిని ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్యనాయకులు కలిశారు. బుధవారం ఉదయం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనూ మాట్లాడే ప్రయత్నం చేసినా సమయం లేకపోవడంతో వాయిదా పడింది. దిల్లీ నుంచి వచ్చాక కలిసే అవకాశం ఉంది.

పార్టీకి నష్టం..

● వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో మంత్రి సురేఖ ఒకవైపు, సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు మరోవైపు ఉండడంపై కాంగ్రెస్ సీనియర్ నాయకులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● మంత్రి వ్యవహరిస్తున్న తీరు, ఒంటెద్దు పోకడలతో పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అధిష్ఠానం పెద్దలకు వివరించినట్లుగా తెలిసింది. శాసనసభ నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు సుప్రీం అని.. ఏదీ జరిగినా తామే కదా జవాబుదారీ అని టీపీసీసీ అధ్యక్షుడికి వివరించారు. ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా నాయకులను సమన్వయం చేయాల్సిన బాధ్యత జిల్లా మంత్రులపై ఉందని.. ఇందుకు విరుద్ధంగా వ్యవహరించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు..

● మంత్రి సురేఖ వాదన మరోలా ఉంది. తమను నమ్ముకున్న కార్యకర్తల కోసం ఉక్కు పిడికిలితో సమాధానం చెబుతామని బహిరంగంగా ప్రకటించారు. పరకాల నియోజకవర్గంతో చాలా అనుబంధం ఉందని, కార్యకర్తలపై దాడులు, పోలీసు కేసులు పెడితే చూస్తూ ఉండాలా? అని వ్యాఖ్యానించారు. గీసుకొండ పోలీసు స్టేషన్‌లో, ధర్మారంలో జరిగిన దాడులు, ఇతర విషయాలను సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వివరించినట్లుగా తెలిసింది. పార్టీకి నష్టం కలిగించడం తన ఉద్దేశం కాదని తెలియజేసినట్లు సమాచారం.

త్వరలోనే సమావేశం

వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో త్వరలోనే సమావేశం ఉంటుందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఉమ్మడి జిల్లా నాయకులతో మాట్లాడే అవకాశాలున్నాయి. అందర్నీ సమన్వయం చేసే బాధ్యత జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అప్పగించారు.

చిన్న కాళేశ్వరం సర్వే పనుల అడ్డగింత



ప్రతాపగిరిలో సర్వేను అడ్డుకున్న రైతులు

కాటారం, న్యూస్‌టుడే: చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ప్రతాపగిరి గ్రామ పరిధిలో పంట భూముల్లో కాలువల నిర్మాణం కోసం చేపడుతున్న సర్వేను స్థానిక రైతులు బుధవారం అడ్డుకున్నారు. పంట భూముల్లో సర్వే నిమిత్తం పాతిన జెండాలను తీసేశారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో చెరువులకు సాగునీరు అందిస్తే రెండు పంటలు సాగయ్యే అవకాశం ఉన్నా.. కాల్వలతో అధికంగా భూములను కోల్పోతామని ఆరోపించారు. కాల్వలతో పంట సాగుకు ఇబ్బందులు ఏర్పడతాయని, జీవనాధారమైన భూములు కోల్పోయి ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి తలెత్తుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాల్వలు లేకుండా సమీప చెరువులను అనుసంధానిస్తూ సాగునీరు అందించే ప్రయత్నం చేయాలని కోరారు. అనంతరం కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, తహసీల్దార్ నాగరాజును కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రైతులు రాజబాబు, రమేష్, మాధవ్, కిష్టయ్య, పర్వతాలు, పోచయ్య, లింగయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ రెండో సంవత్సరంపై నీలినీడలు!

ఇంకా ప్రారంభంకాని తరగతులు

న్యూస్‌టుడే, భూపాలపల్లి కలెక్టరేట్

జిల్లా కేంద్రంలో గతేడాది వైద్య కళాశాలను ప్రారంభించి మొదటి సంవత్సరం తరగతులు నిర్వహించగా.. రెండో ఏడాది తరగతుల నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఇప్పటికే రెండో సంవత్సర తరగతులు ప్రారంభమయ్యాయి. భూపాలపల్లి జిల్లాలో మాత్రం జాప్యం చేస్తున్నారు. ద్వితీయ సంవత్సర విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం లేకపోవడంతో తరగతులు నిర్వహించని పరిస్థితి నెలకొంది.

విద్యార్థులపై ప్రభావం

తరగతుల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం చేస్తుండటంతో విద్యార్థులపై ప్రభావం పడుతుందని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. నిబంధనల ప్రకారం అక్టోబర్ మొదటి వారంలోనే ప్రారంభించాల్సి ఉంది. విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం సరిగా లేదనే కారణంతో ఆలస్యం చేస్తే సిలబస్‌పై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రతి విద్యార్థికి 75 శాతం అటెండెన్స్ అవసరం.. ఇలా రోజుల తరబడి తరగతుల నిర్వహణ జాప్యం చేస్తే హాజరుశాతం పడిపోయే ప్రమాదం ఉంది.

తప్పని ఎదురుచూపులు

రాష్ట్ర కోటాకు సంబంధించి 85 మంది, ఆల్ ఇండియా కోటాకు సంబంధించిన 15 మంది రెండో సంవత్సర విద్యార్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఇతర రాష్ట్రాల విద్యార్థులకు సరైన సమాచారం తెలిపితే అందుకు సంబంధించి టికెట్స్ బుక్ చేసుకుంటామని ఆరా తీస్తున్నారు. అధ్యాపకులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఉంటున్నారని విద్యార్థుల వాట్సప్ గ్రూప్‌లో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్ సౌకర్యంపై రెండు మూడు నెలల ముందే చర్యలు తీసుకోవాల్సిన అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇబ్బందులు తప్పడం లేదు.

పట్టించుకోని అధికారులు

వసతి సౌకర్యంపై అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని విద్యార్థులు అంటున్నారు. రెండో ఏడాదికి సంబంధించి హాస్టల్ కోసం పాత కలెక్టరేట్ భవనంతో పాటు, నూతనంగా నిర్మాణం జరిగిన ఆయుష్ భవనాలను పరిశీలించారు. అందులో విద్యార్థులకు వసతి కల్పించాలని ఆలోచన కూడా చేశారు. కానీ, తాజాగా పాత కలెక్టరేట్ భవనంలోకి మైనారిటీ గురుకుల పాఠశాలను తరలిస్తుండగా నూతనంగా నిర్మించిన ఆయూష్ భవనాన్ని నర్సింగ్ విద్యార్థులకు కేటాయించారు. దీంతో మళ్లీ కథ మొదటి కొచ్చింది. మొదటి సంవత్సరం విద్యార్థులకు కేటాయించిన గదుల్లో వారితో పాటు ఉండాల్సిందేనని అధ్యాపకులు అంటున్నట్లు విద్యార్థులు తెలుపుతున్నారు. ఈ లెక్కన ఒక్కో గదిలో ఆరుగురు విద్యార్థులకు బదులు 10 మందికి పైగా ఉండాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన చెందుతున్నారు. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ప్రత్యేక చొరవచూపాలని కోరుతున్నారు.



భూపాలపల్లి ప్రభుత్వ వైద్య కళాశాల

'అధికారుల నిర్లక్ష్యంతోనే నష్టపోయాం'

కమలాపురం(మంగపేట), న్యూస్‌టుడే: ఉద్యోగ విరమణ పొందిన 38 మంది కార్మికులకు అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అన్యాయం జరిగిందని, ఒక్కో కార్మికుడు రూ.5 లక్షల వరకు నష్టపోయారని బిల్టు కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక విలేకర్లతో కార్మికులు గులగుట్ట విజయరావు, గూడా యాదగిరి ముత్తినేని వెంటకేశ్వర్లు, బత్తుల వెంకటనారాయణ మాట్లాడారు. రావాల్సిన వేతనాలు, ఇతర అలవెన్సుల విషయంలో నష్టం జరిగిందన్నారు. లేబర్ కోర్టులో కేసు నడుస్తుండగానే వరంగల్ జాయింట్ కమిషనర్ వద్ద చర్చలు జరుపుతున్న సమయంలో ఒక్కో కార్మికునికి రూ.7 లక్షలు వస్తున్నాయని చెప్పి డబ్బులు జమచేస్తామని సంతకాలు చేయించారన్నారు. విషయం తెలుసుకున్న ఐకాస నాయకులు కొంతమంది జాయింట్ కమిషనర్ వద్దకు వెళ్లి 38 మందికి రూ.7 లక్షలు ఇస్తే మిగిలిన 650 మందికి ఈ విధంగానే ఇవ్వాల్సి వస్తుందని, ఐకాస నాయకులు యాజమాన్యంతో కుమ్మక్కై రూ.2 లక్షలు మాత్రమే వచ్చేలా చేశారని ఆరోపించారు. ఇందులో కార్మికశాఖ అధికారుల హస్తం కూడా ఉందన్నారు. కార్మికులను మోసం చేయకుంటే ఎందుకు సంతకాలు చేయించారని ప్రశ్నించారు. న్యాయం జరిగేలా సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంపై అన్ని రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు ముందుకొచ్చి కార్మికులకు జరిగిన అన్యాయంపై నిలదీయాలని కోరారు.

జోరుగా సీతాఫలాల అమ్మకాలు



జనగామలోని వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై సాగుతున్న విక్రయాలు

బచ్చన్నపేట (జనగామ), న్యూస్‌టుడే: తెలంగాణ ఆపిల్‌గా పేరొందిన సీతాఫలం క్రయవిక్రయాలు జనగామ జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. రోజుకు రూ. లక్షల్లో అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులు నిలిచిపోవడంతో పల్లె వాసులు కుటుంబ సభ్యులతో కలిసి అడవిబాట పడుతూ కాయలను తెంపి, ప్రధాన రహదారులపై అమ్ముతున్నారు. ధర ఎక్కువైనా తగిన పోషకాలు మెండుగా ఉండటంతో స్థానికులు, ప్రయాణికులు తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు.

ధర ఎక్కువైనా.. మక్కువతో..

జనగామ, చేర్యాల, బచ్చన్నపేట, నర్మెట్ట తదితర మండలాల నుంచి జిల్లా కేంద్రంలోని ఏరియాసుపత్రి వద్ద ఉన్న మార్కెట్, వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపైన విక్రయాలు జరుపుతున్నారు. గంప లెక్కన ఒక్కో దానికి రూ.400 నుంచి రూ.600 వరకు అమ్ముతుండగా, జనాలు తగిన బేరంతో తీసుకుంటున్నారు. బచ్చన్నపేట మండలం మన్సాన్‌పల్లి అటవీ ప్రాంతం నుంచి రెండు రోజులకోసారి వాహనంలో జిల్లా మార్కెట్‌కు తరలిస్తున్నారు. జిల్లా నుంచి హైదరాబాద్, మిర్యాలగూడ, కోదాడ, విజయవాడ, రాజమండ్రి, ఒంగోలు, గుంటూరు తదితర ప్రాంతాలకు కాయల సైజును బట్టి ఎగుమతి చేస్తున్నారు.

పోషకాలు మెండు..

ఈ ఫలంలో పోషకాలు కూడా మెండుగా ఉన్నాయి. వీటి ఆకులు మధుమేహాన్ని అదుపులో ఉంచడం, అధిక బరువు తగ్గించడంతో పాటు జలుబును కూడా నివారిస్తుంది. పండ్లలో కెరోటిన్, థయామిన్, రిబోఫ్లేవిన్, నియాసిన్, విటమిన్ సీ వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. లోపలి గుజ్జు తింటే జీర్ణక్రియ కూడా వేగవంతంగా పనిచేస్తుంది. అందుకే పలు కంపెనీలు కూడా మందుల తయారీకి వీటిని వినియోగిస్తూ, దిగుమతి చేసుకుంటున్నారు.

ఐటీఐ కోర్సులకు దరఖాస్తు చేసుకోండి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉపాధి, శిక్షణ శాఖ ప్రభుత్వ ఐటీఐ కళాశాల భూపాలపల్లిలో నూతనంగా ప్రవేశపెట్టిన ఆరు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో భూపాలపల్లి, కాజీపేట ఐటీఐ ప్రిన్సిపల్‌తో నూతనంగా ప్రవేశపెట్టిన కోర్సులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి, ఆపై విద్యార్హతలు గల విద్యార్థులు భూపాలపల్లి ఐటీఐ కళాశాలలో నేరుగా లేదా https://iti.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ప్రవేశాలు పొందడానికి ఈ నెల 19వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కోర్సులో 40 సీట్లు, ఇండస్ట్రియల్ రోబోటిక్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ కోర్సులో 40 సీట్లు, ఆర్టిజన్ యూసింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్ కోర్సులో 40 సీట్లు, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్(మెకానిక్) కోర్సులో 24 సీట్లు, అడ్వాన్స్‌డ్ సీఎన్సీ మిషనింగ్ టెక్నీషియన్ కోర్సులో 24 సీట్లు, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్ కోర్సులో 24 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేటప్పుడు 10వ తరగతి ధ్రువపత్రాల్లో ఉన్న విధంగానే దరఖాస్తులో నమోదు చేయాలని, పూర్తి వివరాలకు భూపాలపల్లి ఐటీఐ కళాశాలలో లేదా 8985100563 నెంబర్‌కు కాల్ చేయాలన్నారు. కళాశాలలో పారిశుద్ధ్య, విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని.. ఇందుకు మున్సిపల్ అధికారులు అంచనాలు తయారు చేయాలన్నారు. సమావేశంలో ప్రాంతీయ ఉపసంచాలకులు సీతారాములు, భూపాలపల్లి, కాజీపేట ఐటీఐ ప్రిన్సిపాళ్లు జుమ్లానాయక్, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.


అడవుల సంరక్షణకు అంకితభావంతో పనిచేయాలి



శిక్షణ బీట్ అధికారులతో మాట్లాడుతున్న మాధవీ శీతల్

లక్నవరం జలాశయం,(గోవిందరావుపేట), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అడవుల సంరక్షణ చేపట్టాలనే సంకల్పంతో నూతనంగా నియామకాలను చేపట్టిందని పస్రా అటవీక్షేత్రాధికారిణి మాధవీ శీతల్ చెప్పారు. ప్రభుత్వ సంకల్పాన్ని నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ అడవుల సంరక్షణ కోసం అంకిత భావంతో పని చేయాలన్నారు. హైదరాబాద్ దూలపల్లిలోని తెలంగాణ రాష్ట్ర ఫారెస్టు అకాడమీ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న 33 మంది శిక్షణ బీట్ అధికారులు బుధవారం లక్నవరం జలాశయాన్ని సందర్శించారు. ఎనిమిది కిలోమీటర్ల మేర ట్రెక్కింగ్ చేశారు. లక్నవరం ఫెస్టు గురించి మాధవీశీతల్ వివరించారు. లక్నవరం ఎకో పార్కును సైతం సందర్శించారు. లక్నవరం అడవులకు ప్రత్యేకమైన తెల్ల పునికి, నీటీ కానుగ చెట్ల గురించి వివరించారు. లక్నవరం జలాశయం పరిసర ప్రాంతాలతో పాటు జలాశయం తూములను కూడా చూపించారు. ఈ సందర్భంగా మాధవీ శీతల్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అడవుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం కోఆర్డినేటర్ ఎం.వంశీకృష్ణ, పస్రా సెక్షన్ అధికారులు ఎం.వేణు, గోపాల్‌రెడ్డి, ఎఫ్‌బీఓ టి.దీప్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇదేందయ్యా ఇది..



జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ కేంద్రం శివారులోని విద్యుత్తు సబ్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ప్రధాన విద్యుత్తు లైన్‌కు పిచ్చి తీగలు అల్లుకున్నాయి. ఏకంగా 10 అడుగుల మేర చుట్టుకోవడంతో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా వేలాడుతూ, తెగిపోయేలా న్నాయి. వాటిని తొలగించి, ముందస్తు ప్రమాదాన్ని నివారించాలని స్థానిక రైతులు, ఆయా మార్గంలో వెళ్లే ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్తు ఏఈ రణధీర్‌ను వివరణ కోరగా.. తొలగించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, పాలకుర్తి

నలుపు వరి.. ఆరోగ్య సిరి



చుట్టూ పచ్చని పొలాలు. . మధ్యలో నల్లగా ఉన్న పంటను చూస్తే తెగులు సోకిందని అనుకుంటే పొరపాటే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లిలో 15 గుంటలు విస్తీర్ణంలో మహిళా రైతు కొప్పుల కోమల బ్లాక్ రైస్ సాగు చేశారు. తన కుమారుడు బెంగళూరులో ఆయుర్వేద డాక్టర్‌గా శిక్షణ పొందుతున్న క్రమంలో అక్కడి నుంచి తెచ్చిన వరి వంగడాన్ని తెచ్చి సాగు చేసినట్లు వివరించారు. ఆరోగ్యపరంగా పలు ప్రయోజనాలు ఉండటంతో పాటు సాగు సులువుగా చేయవచ్చని.. అందుకే బ్లాక్ రైస్ పండించేందుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సహ సంచాలకులు రావుల ఉమారెడ్డి తెలిపారు.

– ఈనాడు, హనుమకొండ–న్యూస్‌టుడే, మొగుళ్లపల్లి

ప్రాణాలతో చెలగాటమా?

అసలే జాతీయ రహదారి... వాహనాలు వాయువేగంతో దూసుకెళ్తాయి. జనగామ జిల్లా రఘునాథపల్లి టోల్ ప్లాజా వద్ద వాహనంపై ప్రమాదకరంగా ప్రయాణం చేస్తూ ఇలా కనిపించారు. ముందూ వెనక ఎటువంటి ఆసరా లేకుండా ప్రయాణం చేస్తున్నారు. ప్రమాదవశాత్తు పడితే అంతేసంగతులు..

– ఈనాడు,హనుమకొండ





శిక్షణ పొందుతూ.. ప్రత్యక్షంగా వీక్షిస్తూ..



రామప్ప ఆలయంలో వాలంటీర్ల బృందం

వెంకటాపూర్, న్యూస్‌టుడే: యునెస్కో గుర్తింపు పొందిన రామప్పలో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ల శిక్షణ రెండో రోజు కొనసాగింది. బుధవారం ఉదయాన్నే యోగా గురువు రాంబాబు ఆధ్వర్యంలో యోగాసనాలు వేయించారు. అనంతరం కాకతీయ హెరిటేజ్ ట్రస్టు కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు వాలంటీర్లకు శిక్షణ తరగతులను తీసుకున్నారు. రామప్పకు యునెస్కో గుర్తింపు ఎలా వచ్చింది? ఆలయ నిర్మాణ శైలి ఏంటి? కాకతీయులు వాడిన సాంకేతిక పరిజ్ఞానం ఏంటి? ప్రపంచ స్థాయిలో ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానం ఇంకెక్కడైనా ఉందా? గుర్తింపునకు ఎలాంటి కారణాలు దోహదపడ్డాయనే అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మధ్యాహ్నం ప్రొఫెసర్ దేవాప్రతాప్ ఆలయ నిర్మాణంలో వాడిన సామగ్రి, వాటి సేకరణ, ప్రత్యేకంగా ఆ సామగ్రినే ఉపయోగించడానికి గల కారణాలు, వాటికిచ్చిన ప్రాధాన్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణ తరగతుల అనంతరం రామప్ప ఆలయానికి చేరుకుని శిక్షణలో తెలుసుకున్న విషయాలను స్వయంగా ఆలయంలో వీక్షించి వాలంటీర్ల సందేహాలను నివృత్తి చేశారు. ఆలయంలోని రాగిని, నాగిని శిల్పాలు, సాండ్‌బాక్స్ టెక్నాలజీ, కామేశ్వర, కాటేశ్వరాలయ నిర్మాణాలను స్వయంగా చూశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో సామూహికంగా ఫొటోలు దిగారు. కార్యక్రమంలో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ ఇన్‌ఛార్జి శ్రీధర్‌రావు, పర్యాటకశాఖ అధికారి సూర్యకిరణ్, పురావస్తు, పర్యాటక శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యువజన సంఘాల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాల పరిధిలో యువజన సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించేందుకు యువజన సంఘాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి జిల్లా సమన్వయ అధికారి చింతల అన్వేశ్ బుధవారం తెలిపారు. యువజన సంఘాల్లోని సభ్యుల వయసు 18 నుంచి 29లోపు ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న యువజన సంఘాలు నమోదు కోసం సభ్యుల ఆధార్‌కార్డు, సంఘం ప్రతులను హనుమకొండలోని నెహ్రూ యువకేంద్రం కార్యాలయంలో ఈ నెల 19లోపు సమర్పించాలన్నారు. సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో యువజన సంఘాలను భాగస్వామ్యం చేయడమే లక్ష్యమని సమన్వయ అధికారి తెలిపారు. మరిన్ని వివరాలకు 0870 2958776 సంప్రదించాలన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	126
రిటైల్:	148
డ్రెస్డ్:	215
స్కిన్‌లెస్:	244

పత్తి కొనుగోళ్లకు సర్వం సిద్ధం

● కనీస మద్దతు ధర రూ.500 పెంపు

● మార్కెటింగ్ సంయుక్త సంచాలకుడు ఉప్పల శ్రీనివాస్



పత్తి కొనుగోలు సీజన్ ప్రారంభమైంది. ఇప్పటికే వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు అన్నదాతలు తెల్లబంగారంతో రావడం ప్రారంభమైంది. దీపావళి నాటికి విక్రయాలు జోరందుకుంటాయి. ఈ క్రమంలో మార్కెటింగ్ శాఖ పత్తి కొనుగోళ్లకు చేస్తున్న ఏర్పాట్లు ఎలా ఉన్నాయి? ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సీసీఐ ఎన్ని కొనుగోలు కేంద్రాలను నోటిఫై చేసింది? విపణికి సరకు ఏ మేరకు వస్తోంది? తదితర వివరాలతో వరంగల్ మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకుడు ఉప్పల శ్రీనివాస్‌తో సోమవారం 'ఈనాడు' ముఖాముఖి నిర్వహించింది. ఆ వివరాలు.

ఈనాడు, వరంగల్, ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే

ముఖాముఖి

? పత్తి రైతులు సరకుతో మార్కెట్‌కు రావడం ప్రారంభమైంది. ఈసారి కనీస మద్దతు ధర ఏ మేరకు పెరగనుంది?

✔ దసరా పండగ ముగియడంతో రైతులు పెద్ద మొత్తంలో పత్తి పంటతో వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు వస్తున్నారు. ఈసారి వారికి ధర లాభసాటిగా ఉంటుందని భావిస్తున్నాం. కనీస మద్దతు ధర రూ.500 పెరిగింది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) క్వింటాకు మద్దతు ధర రూ.7521 చెల్లించనుంది.

? సీసీఐకు విక్రయిస్తే రైతుల ఖాతాల్లో ఎన్ని రోజుల్లో డబ్బులు జమ వుతాయి?

✔ రైతులు ఆధార్ అథెంటిఫికేషన్ చేసుకుని ఉంటే కొనుగోలు కేంద్రాల వద్ద పని సులువు అవుతుంది. ఆధార్‌తో లింక్ అవడం వల్ల పత్తి విక్రయించిన రెండు మూడు పని దినాల్లో డబ్బులు ఖాతాల్లో జమవుతాయి.

? పత్తి రైతులకు మార్కెటింగ్ శాఖ అన్ని సౌకర్యాలు కల్పిస్తోందా?

✔ రైతులకు సాంకేతికతను చేరువ చేసేందుకు ఒక వాట్సప్ నెంబర్ (8897281111) కూడా మా శాఖ కొత్తగా ప్రవేశపెట్టింది. అందులోకి రైతులు వెళ్లి 'హాయ్' అని టైప్ చేస్తే కావాల్సిన సమాచారం వస్తుంది. ఏ యే జిన్నింగ్ మిల్లులో ఎంత మంది విక్రయాల కోసం వేచిచూస్తున్నారనే వివరాలు తెలుసుకోవచ్చు. ఎనుమాముల మార్కెట్‌లో ఇప్పటికే తాగునీటి వసతి కల్పించాం. విద్యుత్తు సరఫరా, యార్డులను శుభ్రం చేసి పెడుతున్నాం. సీసీఐ కొనుగోలు కేంద్రాలపై కూడా మా సిబ్బంది పర్యవేక్షణ ఉంటుంది. రైతులు పెద్ద ఎత్తున రావడానికి ముందే అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. మా శాఖ మంత్రి, ఉన్నతాధికారులతో సమీక్ష సైతం పూర్తయ్యింది.

? మద్దతు ధర పెరిగిన నేపథ్యంలో రైతులు ప్రైవేటు వ్యాపారుల కన్నా సీసీఐకే ఎక్కువ పత్తిని విక్రయించే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో ఎన్ని కేంద్రాలను నోటిఫై చేశారు?

✔ ఉమ్మడి జిల్లాలో 58 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. ప్రస్తుతం 28 నోటిఫై చేశాం. త్వరలో వంద శాతం మిల్లులను అందుబాటులోకి తెస్తాం. రైతులు నేరుగా ఆ కేంద్రాలకు తీసుకొచ్చి పత్తిని విక్రయించవచ్చు. కనీస మద్దతు ధర కన్నా ఎక్కువ ధర వస్తే రైతులు బయట విక్రయించుకోవచ్చు. అప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాయి.

? సరకు రాక అంచనా గతేడాదికన్నా పెరిగిందా.. తగ్గిందా?

✔ ఇప్పటికే మేం సరకు రాకపై ఒక అంచనా రూపొందించుకున్నాం. గతేడాది 28.72 లక్షలు మెట్రిక్ టన్నులు వచ్చింది. ఈ ఏడాది సరకు రాక మరింత పెరుగుతుందని వ్యవసాయ శాఖ గణాంకాల ద్వారా స్పష్టమైంది. సుమారు 32.09 లక్షలు మెట్రిక్ టన్నుల పత్తి మార్కెట్‌కు వస్తుందని అంచనా వేశాం. ప్రస్తుతానికి ఎనుమాములకు కొద్ది మొత్తంలో మాత్రమే సరకు వస్తోంది. దీన్ని ప్రైవేటు వ్యాపారులు కొంటున్నారు. వరంగల్, సూర్యాపేట, నల్గొండ, ఆదిలాబాద్, ఖమ్మం, భువనగిరి తదితర జిల్లాల నుంచి అక్టోబరులో సరకు రావడం మొదలవుతుంది. నవంబరులో మిగతా జిల్లాల నుంచి పెద్ద మొత్తంలో వస్తుంది.

? పత్తిని మార్కెట్‌కు తీసుకొచ్చే క్రమంలో రైతులకు మీరిచ్చే సూచనలు ఏమిటి? తేమ శాతం ఎంత వరకు ఉంటే సీసీఐ కొనుగోలు చేస్తుంది?

✔ వచ్చేది చలికాలం కాబట్టి ఉదయం వేళ పత్తిపై తేమ ఎక్కువగా ఉంటుంది. అందుకే తొక్కడానికి సమయం తీసుకోవాలి. లేదంటే తేమ లోపల అలాగే ఉంటుంది.. రైతులు కోసిన వెంటనే తీసుకొస్తే మాయిశ్చర్ ఎక్కువగా నమోదవుతుంది. చాలా మంది రైతులు గ్రేడింగ్ చేయకుండా సరకును తీసుకురావడం వల్ల సీసీఐ వాళ్లు నిరాకరిస్తారు. గ్రేడింగ్ చేయడం మరవొద్దు. తేమ 8 నుంచి 12 శాతం వరకు ఉంటే సీసీఐ కొనుగోలు చేస్తుంది. కొనుగోలు కేంద్రాల్లో వే బ్రిడ్జ్ మీదున్న బరువును అన్నదాతలు సరిచూసుకోవాలి.

ఎంజీఎంలో అరుదైన శస్త్రచికిత్స

● మహిళా గొంతుపై థైరాయిడ్ గడ్డ తొలగింపు



బాధితురాలితో వైద్య బృందం

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో జనరల్ సర్జరీ విభాగం వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి. . ఓ మహిళ ప్రాణాలు కాపాడారు. వైద్యాధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలానికి చెందిన జన్ను వరలక్ష్మి(46) గొంతుపై 25 సె.మీ. వెడల్పుతో మెడ చుట్టూ ఆక్రమించి ఉన్న థైరాయిడ్ గడ్డతో పదేళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. మెదడుకు రక్తప్రసారం చేసే నరాలను గడ్డ చుట్టుముట్టడంతో ఆహారం మింగలేకపోతున్నారు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా. . హైదరాబాద్‌లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లినా.. ఫలితం కనిపించలేదు. చివరికి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు శస్త్రచికిత్స చేయడానికి రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. కానీ ప్రాణాలకు హామీ ఇవ్వలేమని చెప్పారు. దిక్కుతోచని పరిస్థితుల్లో 10రోజుల క్రితం ఎంజీఎం ఆసుపత్రి జనరల్ సర్జరీ వైద్య విభాగానికి వచ్చారు. ప్రొఫెసర్ డా.శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో వైద్య బృందం పరీక్షించింది. అన్నిరకాల పరీక్షల అనంతరం బుధవారం సుమారు 5 గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించారు. బాధితురాలి గొంతుపై 25సె.మీ. వెడల్పులో ఉన్న థైరాయిడ్ గడ్డను విజయవంతంగా తొలగించారు. ఈ శస్త్రచికిత్సలో ప్రొఫెసర్ శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు డా. వినోద్‌కుమార్ దుస్సా, సీనియర్ రెసిడెంట్లు, పీజీ వైద్యులున్నారు. శస్త్రచికిత్స అనంతరం బాధితురాలు ఆరోగ్యంగా ఉందని వైద్యులు ధ్రువీకరించారు. కాగా ఇంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సను ఎంజీఎం ఆసుపత్రిలో ఉచితంగా చేశారు. శస్త్ర చికిత్సలో పాల్గొన్న వైద్యులను ఎంజీఎం సూపరింటెండెంట్ డా.చిలుక మురళి అభినందించారు.

ఆర్టీసీ బస్సులకు అనుమతి లేదెందుకు?



వంతెన మీదుగా తిరుగుతున్న ప్రైవేటు వాహనాలు

హనుమకొండ నగరంలో ప్రధానమైన నయీంనగర్ నాలాపై వంతెన నిర్మాణం పూర్తైనా ఆర్టీసీ బస్సులు ఈ మార్గంలో తిరగడం లేదు. ఏటా వర్షాకాలం నాలా పొంగి కాలనీలను ముంచెత్తుతుండటంతో ప్రభుత్వం రూ.7.40 కోట్ల నిధులతో ఈ ఏడాది ఏప్రిల్ 5 నాలా విస్తరణ, వంతెన నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టింది. దీంతో ఈ మార్గం గుండా రాకపోకలకు సాగించే ఆర్టీసీ బస్సులను దారి మళ్లించి నడిపారు. దీనికి అదనంగా టికెట్టుపై రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారు. పనులు పూర్తై, ఆటోలు, స్కూల్ బస్సులు, ఇతర వాహనాలు తిరుగుతున్నా ఆర్టీసీ అధికారులు మాత్రం బస్సులను ములుగు రోడ్డు, పెద్దమ్మగడ్డ మీదుగానే తిప్పుతున్నారు. దీని కారణంగా ప్రయాణికులపై ఆర్థికంగా అదనపు భారం పడటమేకాకుండా.. కరీంనగర్, సిద్దిపేట, వేములవాడ, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లేవారికి సమయం కూడా వృథా అవుతోంది. – న్యూస్‌టుడే, హనుమకొండ చౌరస్తా

అవిభక్త కవలలకు 22 ఏళ్లు

● సొంతగ్రామంలో పుట్టినరోజు వేడుకలు



కేక్ తినిపిస్తున్న వీణ-వాణి తల్లిదండ్రులు మురళి-నాగలక్ష్మి

దంతాలపల్లి, న్యూస్‌టుడే: దంతాలపల్లి మండలం బీరిశెట్టి గూడెం గ్రామానికి చెందిన అవిభక్త కవలలు వీణ, వాణి ఇరవై ఏళ్ల అనంతరం తమ సొంతింట్లో పుట్టిన రోజు వేడుకలను జరుపుకొన్నారు. మారగాని మురళి-నాగలక్ష్మి దంపతులకు రెండో సంతానంగా సూర్యాపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వీరు జన్మించారు. 13 ఏళ్ల పాటు నీలోఫర్ ఆసుపత్రిలోనే ఉన్నారు. అనంతరం స్టేట్‌హోంకు తరలించారు. అప్పటి నుంచి అక్కడే పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. స్టేట్‌హోం సూపరింటెండెంట్లు సఫియాఖాన్, సోమలక్ష్మితో కలిసి హైదరాబాద్ నుంచి బీరిశెట్టి గూడెం చేరుకోగా ఈసారి తమ ఇంట్లో బుధవారం 22వ జన్మదినాన్ని జరుపుకొన్నారు. బంధువులు, గ్రామస్థులు హాజరయ్యారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ ప్రభుత్వం తమను ఆదుకోవాలని, పిల్లలతో కలిసి ప్రతి జన్మదినాన్ని జరుపుకొనేలా అవకామివ్వాలని కోరారు. ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో పలువురు వీరికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

మేడారం జాతరలో శాశ్వత ఏర్పాట్లకు కృషి



వనదేవతలకు కుటుంబసమేతంగా పూజలు నిర్వహిస్తున్న మంత్రి కొండా సురేఖ

మేడారం(తాడ్వాయి), న్యూస్‌టుడే: మా కుల దైవమైన సమ్మక్క, సారలమ్మను దర్శించుకోవడం సంతోషంగా ఉందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంత్రి కుటుంబసమేతంగా బుధవారం మేడారం వచ్చి తన మనవడి పుట్టువెంట్రుకలు సమర్పించారు. అమ్మవార్లకు ఎత్తుబెల్లం, నూతన వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత మహా జాతర సందర్భంగా కోరిన కోర్కెలు తీరినందుకు మేడారం వచ్చి మొక్కులు చెల్లించామన్నారు. మేడారాన్ని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఎక్కువ అభివృద్ధి చేసిందన్నారు. ప్రస్తుతం కేంద్రంలో తమ ప్రభుత్వం ఉన్నట్లయితే జాతీయ హోదా దక్కి మరింత అభివృద్ధి చెందేదని తెలిపారు. రాబోయే జాతరనాటికి భక్తులకు అన్ని రకాల శాశ్వత ఏర్పాట్లు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రం ఆర్థికాభివృద్ధి సాధించి ప్రజలకు మేలు జరగాలని దేవతలను వేడుకోవడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, డీఎఫ్‌వో రాహుల్‌కిషన్ జాదవ్, దేవాదాయశాఖ డీసీ శ్రీకాంత్‌రావు, తహసీల్దారు రవీందర్, ఎంపీవో శ్రీధర్‌రావు, ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

బమ్మెర పర్యాటకాభివృద్ధి పనులపై నీలినీడలు

పాలకుర్తి, న్యూస్‌టుడే

జనగామ జిల్లాలోని బమ్మెర, వల్మిడి, సోమేశ్వరాలయం, పాలకుర్తికి తరాల చరిత్ర ఉంది. ఇక్కడ ఎందరో మహానుభావులు, కవులు, కళాకారులు, పోరాటయోధులు పురుడుపోసుకున్నారు. అంతటి ప్రాధాన్యత ఉన్న ఈ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని గత ప్రభుత్వం 2017లో సుమారు రూ.23 కోట్లు మంజూరు చేయగా, పనులు చేపట్టారు. వల్మిడి, పాలకుర్తిలో 90 శాతం మేర నిర్మాణాలు పూర్తి కాగా, బమ్మెరలో మాత్రం ఏళ్లుగా ఆగుతూ. . సాగుతూ.. వస్తున్నాయి.

40 శాతం మేర నిర్మాణ దశలోనే..

బమ్మెరలో సహజ కవి పోతన చారిత్రక ఆనవాళ్లు ఉన్న ప్రదేశంలోనే సుమారు 4 ఎకరాల స్థలంలో పర్యాటకాభివృద్ధి పనులు చేపట్టారు. 2019లో పోతన స్మృతివనంతోపాటు గ్రంథాలయం, అక్షరభ్యాస కేంద్రం, విడిది కేంద్రాలు, సమాధి, బావి పునరుద్ధరణ, ఆడిటోరియం తదితరాలు చేపట్టగా, అవి ఇంకా నిర్మాణ దశలోనే మగ్గుతున్నాయి. అలాగే రూ.3 కోట్లతో పోతన కాంస్య విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే కొన్నాళ్లుగా నిలిచిన పనులపై స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కలెక్టర్ రిజ్వాన్‌బాషాలు ఇతర శాఖల అధికారులతో పలుమార్లు సమీక్షించారు. చేసిన వాటికి బిల్లులు రాకపోవడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇంకా 40 శాతం మేర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. బమ్మెరను అభివృద్ధి చేస్తే పర్యాటకుల రాకతో ఆదాయం పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే సోమేశ్వరాలయం ఆ ఖ్యాతిని దక్కించుకోగా, అక్కడి నుంచి వచ్చే భక్తులు బమ్మెర, వల్మిడి ప్రాంతాలను సైతం సందర్శిస్తున్నారు. పెండింగ్ పనులు పూర్తి చేసి సరైన వసతులు, సౌకర్యాలు మెరుగుపరచాల్సి ఉంది.



పురోగతి కనిపించని స్మారక కేంద్రం



అసంపూర్తిగా ఆడిటోరియం నిర్మాణం..

పర్యాటక కేంద్రాలుగా విరాజిల్లేలా కృషి..

- మామిడాల యశస్విని రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే

గత గుత్తేదారుల నిర్లక్ష్యం వల్లే పర్యాటకాభివృద్ధి పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. పనుల పురోగతి, ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించి, త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకుంటాం. రానున్న రోజుల్లో పాలకుర్తి, బమ్మెర, వల్మిడి ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా విరాజిల్లేలా కృషి చేస్తా.

స్కూటీ డిక్కీలోని బంగారం మాయం

భూపాలపల్లి, న్యూస్‌టుడే : భూపాలపల్లి పట్టణంలోని కేటీకే 8వ గని ప్రాంతంలోని వెయ్యి క్వార్టర్ల ఏరియాలో నివాసం ఉంటున్న సింగరేణి కార్మికుడు సలీంద్ర శ్రీనివాస్ కుమారుడు విజయ్‌కుమార్ స్కూటీ డిక్కీలో పెట్టిన 6 తులాల బంగారం మాయమైంది. ఈ చోరీ సినీ ఫక్కీలో జరిగినట్లు తెలుస్తోంది. స్థానిక సీఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కుమారుడు విజయ్‌కుమార్‌తో పాటు తల్లి అరుణ పట్టణంలోని అంబేడ్కర్ కూడలి ప్రాంతంలోని యూనియన్ బ్యాంకునకు బుధవారం స్కూటీపై వచ్చారు. బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారాన్ని తీసుకుని, సెల్‌ఫోన్‌తో పాటు బంగారాన్ని ఓ బ్యాగులో ఉంచి స్కూటీ డిక్కీలో పెట్టారు. అనంతరం వారు బ్యాంకు నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో మార్గమధ్యంలో మంజూరునగర్ ప్రాంతంలో సోమేశ్వర్ మెడికల్ షాపు ముందు బండిని పార్కు చేసి, మందులు కొనుగోలు చేసి ఇంటికి వెళ్లారు. ఇంటి వద్ద స్కూటీ డిక్కీ ఓపెన్ చేసి చూడగా బ్యాగు కనిపించలేదు. మాయమైన బంగారం విలువ సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గాలికుంటు నివారణకు ప్రత్యేక కార్యాచరణ

భూపాలపల్లి, న్యూస్‌టుడే : పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా గాలికుంటు వ్యాధి నివారణకు పశువులకు టీకా వేయడం ప్రారంభించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లోని పశువులకు జిల్లా పశువైద్యశాఖ ఆధ్వర్యంలో టీకా వేసే ప్రక్రియ రెండు రోజుల క్రితం ప్రారంభించారు. కార్యక్రమం సుమారు నెల పాటు కొనసాగనుంది. వ్యాధి సోకడానికి ప్రధానంగా క్రిములు గాలిలో ప్రయాణించి ఇతర పశువులకు సోకే అవకాశం ఉన్నందున జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పశువైద్యులతో పాటు సిబ్బంది ప్రతి పశువుకు టీకా వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే టీకాను ప్రతి ఆరు నెలలకు ఒకసారి వేసి, రాబోయే నాలుగేళ్లలో గాలికుంటు వ్యాధిని పూర్తిగా నివారించేందుకు జిల్లా పశువైద్యాధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. జిల్లా వ్యాప్తంగా 24 పశువైద్య బృందాలు ఏర్పాటు చేశారు.

వ్యాధి లక్షణాలు ఇలా : పశువులకు గాలికుంటు వ్యాధి సోకినప్పుడు గాలి ద్వారా వాటికి సమీపంలోని చుట్టుపక్కల 5 కిలోమీటర్ల దూరంలో ఉన్నవాటికి కూడా వ్యాధి సోకే అవకాశం ఉంటుంది. వ్యాధి సోకిన పశువులకు 105 డిగ్రీల జ్వరం వస్తుంది. పశువుల నోటిలో పుండ్లు ఏర్పడి నాలుక చెడిపోయి మేతతో పాటు నీరు తాగడానికి ఇబ్బంది పడుతాయి. ఈ క్రమంలోనే రోజు రోజుకు క్షీణించి సన్నగా మారి చనిపోతాయి. అదేవిధంగా కాళ్లగిట్టలకు పుండ్లు ఏర్పడి నొప్పి పెట్టడంతో పాటు నడవలేని పరిస్థితి ఉంటుంది. పాల దిగుబడి తగ్గుతుంది. గర్భంతో ఉన్న పశువులకు గర్భస్రావం అయ్యే ప్రమాదం ఉంటుంది.

జిల్లాలో పశుసంపద వివరాలు..	
మొత్తం పశువులు	1,32,185
తెల్లజాతి	69,427
నల్లజాతి	62,758

వచ్చే నెల 14 వరకు : ఈ నెల 15 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగుతుంది. అధికారులు గ్రామాలకు వెళ్లే ముందు రోజు పల్లెల్లో టాం.. టాం వేయించి, కార్యక్రమాన్ని నిర్వహించాలి. పశువైద్యులు, సిబ్బంది ప్రతి రైతుల వద్దకు వెళ్లి పశువులకు టీకా వేయాలి. అధికారులు వెళ్లినప్పుడు గ్రామాల్లో లేని రైతులకు సంబంధించిన పశువుల కోసం అదనంగా మరో 10 రోజులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నారు.


చెల్పూరులో పశువుకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

సిబ్బంది కొరతతో : జిల్లాలో 30 పశువైద్యశాలలు ఉన్నాయి. పశువైద్యశాఖలో ఖాళీలు ఆరు ఏళ్లుగా ప్రభుత్వం భర్తీ చేయలేదు. దీంతో సిబ్బంది కొరత తీవ్రంగా ఏర్పడింది. జిల్లాలో మొత్తం 17 మంది పశువైద్యాధికారులకు 13 మంది పనిచేస్తున్నారు. నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీఎల్‌వో ఒకరు, జేఈవోలు నలుగురు పని చేస్తున్నారు. ఎల్ఎస్‌ఏలు తొమ్మిది మంది ఉండాల్సి ఉండగా ఆరుగురు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వెటర్నరీ అసిస్టెంట్లు 15 మందికి తొమ్మిది మంది పని చేస్తున్నారు. ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అటెండర్లు 25 మందికి 12 మంది పనిచేస్తున్నారు. 13 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 22 మంది గోపాలమిత్రలు పనిచేస్తున్నారు. ఈ మేరకు సిబ్బంది, సంబంధిత అధికారుల కొరత కారణంగా ఉన్నవారిపై భారం పడుతుంది.

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- కుమారస్వామి, జిల్లా పశువైద్యాధికారి, భూపాలపల్లి

జిల్లాలో అన్ని రకాల పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నాం. కార్యక్రమాన్ని నెల పాటు కొనసాగిస్తాం. గ్రామాల్లో పశువులు ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రైతుల వద్దకే పశువైద్య సిబ్బంది వస్తారు. ఎవరైనా రైతులు అందుబాటులో లేకుంటే వారి కోసం 10 రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం.

కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తే చర్యలు

భూపాలపల్లి, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోనే కాకుండా వివిధ మండలాల్లో హోటళ్లు, రెస్టారెంట్లలో కాలం చెల్లిన కల్తీ ఆహారపదార్థాలను ప్రజలకు విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఆహార భద్రత అధికారి రోహిత్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని సితార ఫ్యామిలీ రెస్టారెంట్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెస్టారెంట్‌లో నిల్వ చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. కొన్ని ఆహార పదార్థాలపై అనుమానం రావడంతో నమూనాలు తీసుకుని హైదరాబాద్‌లోని నాచారంలోని ల్యాబ్‌కు పంపించినట్లు రోహిత్‌రెడ్డి తెలిపారు. ఫలితాలు వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చీమలు, బొద్దింకలు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నేడు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడి పర్యటన

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : నేడు(గురువారం) జిల్లాలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమావేశానికి సమగ్ర నివేదికలతో హాజరు కావాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ

● ఒకరి దుర్మరణం.. ఇద్దరికి తీవ్ర గాయాలు

వెంకటాపూర్, న్యూస్‌టుడే: భూపాలపల్లి మండలంలోని పెద్దాపూర్-జంగుపల్లి గ్రామాల మధ్య బుధవారం సాయంత్రం లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఘటనలో జంగుపల్లి గ్రామానికి చెందిన పేరాల వెంకటేశ్వర్‌రావు(16) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా గణపురం మండలం జంగుపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్‌రావు, వి.మణిప్రసాద్, జె.అశ్వంత్‌లు పెద్దాపూర్ నుంచి జంగుపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో జంగుపల్లి నుంచి పెద్దాపూర్‌కు అతివేగంతో వస్తున్న లారీ మూలమలుపు వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ టైరు కింద వెంకటేశ్వర్‌రావు పడి నుజ్జునుజ్జయిపోయాడు. మిగతా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. సమాచారం మేరకు వెంకటాపూర్ ఎస్సై జక్కుల సతీష్ సంఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


వెంకటేశ్వర్‌రావు(పాతచిత్రం)

అదృశ్యమైన యువకుడి మృతి

కాటారం, న్యూస్‌టుడే : నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి కాటారం మండలంలోని నస్తూర్‌పల్లి గ్రామ శివారులో ప్రమాదం బారిన పడి శవమై కనిపించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన సవాయిసింగ్(29) జీవనోపాధి నిమిత్తం కాళేశ్వరం వచ్చి మిఠాయిల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ నెల 13న వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై కాటారం వచ్చి తిరిగి వెళ్లాడు. పలుచోట్ల ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. మంగళవారం కాళేశ్వరం ఠాణాలో ఇచ్చిన ఫిర్యాదుతో అదృశ్యం కేసు నమోదైంది. జాతీయ రహదారి 353సీ నస్తూర్‌పల్లి-మహదేవపూర్ మార్గమధ్యలో రహదారి పక్కన ద్విచక్రవాహనం, గుర్తుపట్టని రీతిలో ఉన్న సవాయిసింగ్ మృతదేహాన్ని బుధవారం పలువురు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అతివేగంతో వెళ్తూ ద్విచక్రవాహనం అదుపుతప్పి రహదారి పక్కకు దూసుకెళ్లి కింద పడడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు లక్ష్మణ్‌సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మొగిలి తెలిపారు.


సవాయిసింగ్(పాత చిత్రం)

వాహనం అదుపుతప్పి తీవ్రగాయాలు

కాటారం, న్యూస్‌టుడే : 353సీ జాతీయ రహదారిపై నస్తూర్‌పల్లి సమీపంలో జరిగిన రహదారి ప్రమాదంలో బయ్యారం గ్రామానికి చెందిన పసుల గణేష్ అనే యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. వాహనదారులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గణేష్ ఇటీవల తన స్నేహితుడు కొనుగోలు చేసిన ద్విచక్ర వాహనం తీసుకొని మహదేవపూర్ వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో అధికవేగంతో వస్తూ నస్తూర్‌పల్లి సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడగా తలకు తీవ్రగాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన వాహనదారులు పోలీసులకు సమాచారం అందించి 108 అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

‘ఇలాగైతే కళాశాలలు నిర్వహించలేం’



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులకు బోధనా రుసుము, ఉపకార వేతనాలు చెల్లించడం లేదని, ఇలాగైతే తాము కళాశాలలు నిర్వహించలేమని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం (టీపీడీఎంఏ) నాయకులు పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో మూడ్రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలలు బంద్ చేసి, నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుధవారం పార్కు నుంచి హనుమకొండ కలెక్టరేట్‌కు వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ప్రావిణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. బోధనారుసుం మంజూరు చేయకపోతే కళాశాలలు నిర్వహించలేక అప్పులపాలై మూసివేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం భవనాల అద్దె, అధ్యాపకులు, సిబ్బందికి వేతనాలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నామన్నారు. ఏడాది కిందట విడుదల చేసిన టోకెన్ నెంబర్లకు సంబంధించిన రూ.600 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేయూ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.ఉపేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభాకర్ రెడ్డి, కోశాధికారి జి.వేణుమాధవ్, టీపీడీఎంఏ సభ్యులు శ్రీధర్‌రావు, రవీంద్రనాథ్, వెంకట్, జిల్లా కోఆర్డినేటర్ వేణుమాధవ్ పాల్గొన్నారు.


మొగుళ్లపల్లిలో..


మహదేవపూర్‌లో స్వాగతిస్తున్న ఎంఈవో శంకరయ్య, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

చిట్యాల, మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే : చిట్యాల, మొగుళ్లపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల పాఠశాలలకు కేటాయించిన నూతన ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. ఆయా మండల కేంద్రాల్లోని విద్యా వనరుల కేంద్రాల్లో ఎంఈవోలు రఘుపతి, కమలాకర్‌రావు ఆర్డర్లను అందజేశారు. ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేయాలని వారికి ఎంఈవోలు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం రఘుపతి, పీఆర్టీయూ చిట్యాల మండల కార్యదర్శి సాంబమూర్తి, ఆరెల్లి చంద్రమౌళి, తోకల వేణు, గడ్డం రాములు, గంపల అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మహదేవపూర్ : కొత్తగా నియామకమైన ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. మహదేవపూర్ మండలానికి 47 మంది కొత్త ఉపాధ్యాయులు వచ్చారు. వీరికి మండలంలోని పలు పాఠశాలలను మండల విద్యాధికారి డి.శంకరయ్య కేటాయించారు. కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు డీటీఎఫ్, పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు స్వాగతం పలికారు.

కాటారం : ఇటీవల డీఎస్సీలో ఎంపికైన తొమ్మిది మంది ఉపాధ్యాయులు బుధవారం వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరారు. ముందుగా మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవో శ్రీదేవికి జాయినింగ్ రిపోర్ట్ చేశారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు నూతన ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఎస్జీటీలు-5, స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్-1, సాంఘిక శాస్త్రం-1, పీఈటీలు ఇద్దరు ఉన్నారు.


కాటారంలో..

18న ఉద్యోగ మేళా

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో నిరుద్యోగ యువతీ యువకులకు అపోలో ఫార్మసీ ప్రైవేటు సంస్థలో పని చేసేందుకు ఈ నెల 18న భూపాలపల్లి డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఆరూరి శ్యామల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు విద్యార్హత ధ్రువ పత్రాలతో పాటు ఆధార్, పాన్ కార్డు, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ ప్రతులతో నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు 9701078288, 9502468800 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

మహారాష్ట్రీయుల రిలే దీక్షల విరమణ

మహదేవపూర్, న్యూస్‌టుడే : కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీతో ముంపునకు గురవుతున్న భూములకు పరిహారం అందించాలని మహారాష్ట్రీయులు రిలే నిరాహార దీక్షలు చేపట్టిన విషయం తెలిసిందే. మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా సిరొంచ తాలూకా ప్రభుత్వ కార్యాలయం ఎదుట ఈ నెల 7వ తేదీ నుంచి రిలే దీక్షలు ప్రారంభించారు. భూసేకరణ చేసి మెరుగైన పరిహారం అందించి, న్యాయం చేయాలని కోరుతున్నారు. మహారాష్ట్రలో ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లోకి రావడంతో రిలేదీక్షలు తాత్కాలికంగా విరమించామని, ఎన్నికల తర్వాత మరోమారు దీక్షలు చేస్తామని ఆ ప్రాంత రైతులు తెలిపారు.

ఫిజియోథెరపి సేవలను వినియోగించుకోండి


ఫిజియోథెరపి సేవలను పరిశీలిస్తున్న ఎంఈవో కుమారస్వామి

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే : మండల విద్యా వనరుల కేంద్రంలో నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో లింగాల కుమారస్వామి అన్నారు. బుధవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో ఫిజియోథెరపీ సేవలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ సేవలను ప్రతి బుధవారం ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. మెదరమెట్ల, పిడిసిల్ల, ముల్కలపల్లి, మొగుళ్లపల్లి గ్రామాలకు చెందిన దివ్యాంగ పిల్లలు శిబిరానికి హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో డా.రమాదేవి, ఐఈఆర్పీలు సదయ్య, సురేందర్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ చంద్రమౌళి పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

చిట్యాల, న్యూస్‌టుడే : మద్యం తాగి వాహనం నడిపిన ఓ వ్యక్తికి భూపాలపల్లి జిల్లా సివిల్ కోర్టు జడ్జి రాంచందర్‌రావు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు బుధవారం ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని చింతకుంట రామయ్యపల్లి గ్రామానికి చెందిన దేవేందర్ మండల కేంద్రంలో మద్యం తాగి ద్విచక్ర వాహనం నడుపుతూ పట్టుబడినట్లు చెప్పారు. అతడిని కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష, రూ. 1000 జరిమానా విధించినట్లు వివరించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

భూపాలపల్లి : మున్సిపాలిటి పరిధిలోని భాస్కర్‌గడ్డ గ్రామానికి చెందిన బి.లక్ష్మయ్య, పట్టణంలోని కృష్ణాకాలనీకి చెందిన కుమ్మరి ఎల్లయ్య అనే ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడిపించినందుకు బుధవారం వారికి కోర్టు రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి రూపాయల జరిమానా విధించినట్లు భూపాలపల్లి ఎస్సై సుధాకర్ తెలిపారు.

మల్హర్ : మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరికి జడ్జి రాంచందర్‌రావు జైలు శిక్ష విధించినట్లు కొయ్యూరు ఎస్సై నరేశ్ తెలిపారు. ఇటీవల వాహనాలు తనిఖీ చేస్తుండగా కొయ్యూరుకు చెందిన రవినాయక్, పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లికి చెందిన కుమార్ మద్యం తాగి వాహనం నడపడంతో కేసు నమోదు చేశారు. ఇద్దరిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రెండు రోజుల జైలుతో పాటు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. కాటారం డీఎస్పీ రాంమ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జున రావు, ఎస్సై నరేశ్‌తో పాటు సిబ్బందిని అభినందించారు.

18న క్వార్టర్లకు కౌన్సెలింగ్

భూపాలపల్లి, న్యూస్‌టుడే : భూపాలపల్లి ఏరియాలోని వివిధ కార్మిక కాలనీల్లో ఖాళీగా 169 క్వార్టర్లకు ఈ నెల 18న కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు స్థానిక సింగరేణి జీఎం కార్యాలయంలో బుధవారం సంబంధిత అధికారులు, కార్మిక సంఘాల నాయకులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. పర్సనల్ మేనేజర్, అధికార ప్రతినిధి మారుతి మాట్లాడుతూ.. భూపాలపల్లి డివిజన్‌లో మొత్తం 5,423 మంది ఉద్యోగులకు 4,751 క్వార్టర్లు కేటాయించామని చెప్పారు. కొత్తగా భూపాలపల్లి జిల్లా ఏర్పాటైన సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పలు ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులకు పేమెంట్ పద్ధతిన కార్పొరేట్ స్థాయి అధికారుల ఆదేశాల మేరకు 133 క్వార్టర్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఆరు నెలలుగా క్వార్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహించలేదు. సీనియారిటీ ప్రకారం ఈ నెల 18న పూర్తిగా పారదర్శకంగా క్వార్టర్లు కేటాయించనున్నట్లు తెలిపారు. అన్ని గనుల వద్ద నోటీసు బోర్డులపై తెలియపర్చినట్లు చెప్పారు. ఈ ఏరియాలో క్వార్టర్ల సౌకర్యం లేని 1,099 మంది కార్మికులకు కంపెనీ హెచ్ఆర్ఏ చెల్లిస్తోందని తెలిపారు. సమావేశంలో ఎస్‌వోటు జీఎం కవీంద్ర, డీజీఎం సివిల్ రవికుమార్, ఏఐటీయూసీ నాయకులు రమేష్, రాంచందర్, ఐఎన్‌టీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు జోగ బుచ్చయ్య, రాజేందర్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడిని రక్షించిన పోలీసులు

కాళేశ్వరం, న్యూస్‌టుడే : మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడేందుకు కాళేశ్వరం వచ్చిన ఓ వృద్ధుడిని పోలీసులు రక్షించారు. ఎస్సై చక్రపాణి తెలిపిన వివరాల ప్రకారం.. పొత్కపల్లి మండలం గుంపులకు చెందిన బండారి ఓదెలు(70) అనే వృద్ధుడు గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చాడు. తీరం వద్ద స్థానికులు గమనించి ఠాణాకు సమాచారం అందించడంతో ఎస్సై చక్రపాణి చేరుకొని వృద్ధుడిని ఆ ప్రాంతం నుంచి ఠాణాకు తరలించారు. వృద్ధుడి భార్య ఇటీవల మృతి చెందడంతో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి వారికి అప్పగించారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



మల్హర్, న్యూస్‌టుడే : మండలంలోని తాడిచెర్ల, కాపురం, మల్లారం గ్రామాల్లో బుధవారం ఆబ్కారీ అధికారులు దాడులు నిర్వహించారు. 8 లీటర్ల నాటుసారా, 20 కిలోల చక్కెర స్వాధీనం చేసుకున్నారు. 600 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేయగా ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్సై కిష్టయ్య తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది రాంచందర్, కోటేశ్వర్, వెంకటరాజు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

చేతిపంపు బ్యాటరీ పేలి ఒకరికి గాయాలు

రేగొండ, న్యూస్‌టుడే : పంటలకు పిచికారీ చేసే చేతి పంపు బ్యాటరీ పేలి ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన కొత్తపల్లిగోరి మండలంలోని కోనరావుపేటలో బుధవారం చోటుచేసుకుంది. బాధిత రైతు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రొడ్డ ప్రసాద్ అనే రైతు పంటకు పురుగు మందును పిచికారీ చేసేందుకు ఇంట్లో ఉన్న బ్యాటరీ చేతి పంపు స్విచ్ ఆన్ చేశాడు. ఒక్కసారిగా పంపు బ్యాటరీ పేలడంతో ప్రసాద్‌కు గాయాలయ్యాయి.

మండల కమిటీ ఎన్నిక

మహదేవపూర్, న్యూస్‌టుడే : జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌జీవో) మహదేవపూర్ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సుంకె మధు, ప్రధాన కార్యదర్శి గోగుల నాగేందర్, ఉపాధ్యక్షులుగా నరసింహస్వామితో పాటు కమిటీ సభ్యులను ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రశాంత్, వెన్నంపల్లి మహేశ్ పాల్గొన్నారు.

సెక్యూరిటీ అధికారికి సన్మానం

భూపాలపల్లి, న్యూస్‌టుడే : భూపాలపల్లి ఏరియా సింగరేణి సెక్యూరిటీ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మురళీ మోహన్‌ను బుధవారం స్థానిక సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి కంపెటి రాజయ్య ఆధ్వర్యంలో నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు సెక్యూరిటీ గార్డులు, సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలు తప్పనిసరి

చిట్యాల, మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే : పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశువైద్యాధికారి కుమారస్వామి అన్నారు. బుధవారం చిట్యాల మండలం ఏలేటిరామయ్యపల్లి, మొగుళ్లపల్లి మండలం అంకుషాపూర్, మొట్లపల్లి గ్రామాల్లో నిర్వహించిన గాలి కుంటు టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 14 వరకు గ్రామాల్లో టీకాలు వేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఆయా మండలాల పశు వైద్యులు, సిబ్బంది వెంకన్న, అజయ్, లక్ష్మణ్, సుజాత, కర్ణాకర్, సునీత, గోపాలకృష్ణ, రాకేశ్ శర్మ, శారద, శ్రీనివాస్, చిరంజీవి పాల్గొన్నారు.

కాటారం : కిష్టంపేట, గట్లకుంట, గుండ్రాత్‌పల్లి గ్రామాల్లో జీవాలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు బుధవారం వేశారు. 235 పశువులకు టీకాలు వేసినట్లు పశువైద్యులు డాక్టర్ రమేష్, ధీరజ్ తెలిపారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది అక్రమ్, రాజశేఖర్, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో రజత పతకం


అనయ

కాటారం, న్యూస్‌టుడే: హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన స్పోర్ట్స్ ఫర్ ఆల్ ఛాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో మండల కేంద్రానికి చెందిన రామిళ్ల అనయ సత్తా చాటింది. అండర్-10 విభాగంలో ఆర్చరీ క్రీడా పోటీల్లో ప్రతిభచాటి రజత పతకం సాధించారు. రాష్ట్ర స్థాయిలో రాణించడంపై కోచ్ శ్రీనివాస్, పలువురు అభినందనలు తెలిపారు.

గోపాలపురంలో వైద్య శిబిరం



చిట్యాల, న్యూస్‌టుడే : చిట్యాల మండలం గోపాలపురం గ్రామంలో బుధవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచన మేరకు ఎన్ఎస్ఆర్ అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో 241 మందికి బీపీ, షుగర్, ఈసీడీ, రక్త పరీక్షలు చేసి మందులు అందించినట్లు శిబిరం ఇన్‌ఛార్జి సుమన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్ గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ ఏకు రవీందర్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల నిరసన



భూపాలపల్లి, న్యూస్‌టుడే : ఎన్నికల విధుల పారితోషికం డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ముందు భూపాలపల్లి పురపాలక సంఘం పారిశుద్ధ్య కార్మికులు నిరసన తెలిపారు. ఆరు నెలల క్రితం నిర్వహించిన పార్లమెంటు ఎన్నికల్లో మున్సిపాలిటీ కార్మికులు 150 మంది వరకు ఎన్నికల విధులు నిర్వర్తించినట్లు కార్మికులు బండారి బాబు, సమ్మయ్య, మంజుల తెలిపారు. ఆరు నెలలు గడిచినా ఇంత వరకు అధికారులు డబ్బులు చెల్లించలేదని, ఈ నెల 25వ తేదీ లోగా ఇవ్వకుంటే ఈనెల 26వ తేదీ నుంచి విధులు బహిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కార్మికులు ఆర్డీవోకు వినతి పత్రాన్ని అందజేశారు.

బడికి వెళ్తానని.. అపస్మార స్థితికి!

● చిన్నారి మృతితో విషాదం

జమ్మికుంట, న్యూస్‌టుడే : దసరా సెలవులు ముగిశాయి.. ఆ చిన్నారి ఉదయమే లేచి బ్రష్ చేసుకుంది. . డాడీ అన్నయ్యకు పెన్సిల్ కొనిచ్చావు.. నాకు కొనివ్వు.. అని అడిగింది.. సరేనని చెప్పిన తండ్రితో కొద్దిసేపు పడుకుంటా అని నిద్రపోయింది.. నిద్రలోనే ఫిట్స్ రాగా తల్లిదండ్రులు వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు.. మెరుగైన చికిత్సకు హనుమకొండకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందిందన్న వైద్యుల మాట విని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం పంగిడిపల్లికి చెందిన రాజు జమ్మికుంటలో ఓ ప్రైవేటు కార్యాలయంలో పని చేస్తున్నారు. భార్య, కుమారుడు, కుమార్తె శ్రీయాన్షి(4)తో కలిసి స్థానికంగా నివాసం ఉంటున్నారు. మంగళవారం పాఠశాలలు తెరుచుకోవడంతో శ్రీఆంశి ఉదయమే లేచి పాఠశాలకు వెళ్లాలని బ్రష్ చేసుకుని పడుకుంది. నిద్రలోనే ఫిట్స్ వచ్చాయి. వెంటనే స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతోందని, గుండె తక్కువ కొట్టుకుంటోందని.. మెరుగైన వైద్యానికి వరంగల్ తీసుకెళ్లమన్నారు. వెంటనే హనుమకొండలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు పేర్కొన్నారు. ఎల్‌కేజీ చదువుతున్న శ్రీయాన్షి ఎప్పుడు చలాకీగా ఉండేదని చుట్టుపక్కలవారు చెప్పారు. చిన్నారి మృతదేహాన్ని స్వగ్రామం పంగిడిపల్లికి తీసుకెళ్లడంతో స్థానికంగా బుధవారం విషయం వెలుగులోకి వచ్చింది.


శ్రీయాన్షి

జోనల్ స్థాయి పోటీలు ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి 53వ జోనల్‌స్థాయి రెస్క్యూ పోటీలు బుధవారం ఆర్జీ-2 డివిజన్‌లోని మైన్స్ ఆవరణలో లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా సంస్థ సంచాలకులు వెంకటేశ్వర్‌రెడ్డి, మరో అధికారి సావర్కర్‌లు రెస్క్యూ పతాకాన్ని ఎగరవేశారు. 10 మంది భారత బొగ్గు గనుల భద్రత విభాగం అధికారులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.